కథ

# నూరేళ్ళు

– నడింపల్లి హనుమంతరావు


నూరేళ్ళు పూర్తి చేసుకుంది ఆ ఇల్లు..

నూరేళ్ళు మనకు ఎంతో విలువయిన సమయం. వంద సంవత్సరాల కాలాన్ని శతాబ్దం అంటాం. అలా ఒక శతాబ్దం చరిత్ర తెలుసుకుంటే ఒళ్ళు పులకరిస్తుంది. శతమానం భవతు.. మనిషిని నూరేళ్ళు బతకమని ఆశీర్వదిస్తారు. నూరేళ్ళు జీవించడం నిజంగా ఒక వరం. అలా జీవించిన ఒక మనిషి నుండి మనం ఎన్నో తెలుసుకోవచ్చు. అదే నూరేళ్ళు పూర్తి చేసుకున్న ఒక కట్టడమయితే కాల ప్రవాహంలో ఎన్నో యదార్థ గాథలకు సాక్షీభూతంగా నిలుస్తుంది. మానవ జీవిత విలువలకు, అనుభూతులకు ప్రతీకమవుతుంది. అలాంటిదే నూరేళ్ళు పూర్తి చేసుకున్న- ఆ ఇల్లు.

*   *   *

ఆ ఇంటి యజమాని చంద్రశేఖరం గారు. కానీ ఇప్పుడాయన లేరు. చనిపోయి దాదాపు ఇరవయి సంవత్సరాలయింది. అటు పల్లెటూరు ఇటు నగరం కాని ఈ పట్టణంలో బతికున్న రోజులలో ఆయనొక పేరుమోసిన వకీలు, రాజకీయ నాయకుడు. ఊరు చిన్నదయినా రాజకీయంగా చాలా పెద్దదయిన ఆ వూరుకు ఆయనొక సారి మున్సిపల్ ఛైర్మన్‌గా కూడా పనిచేశారు. ఆయన సంపాదనకు తగ్గట్టుగానే కుటుంబం. నలుగురు కొడుకులు. ఆరుగురు కూతుళ్ళు. మళ్ళీ వాళ్ళ సంతానం. ప్రస్తుతానికి శాఖోపశాఖలుగా ఆయన వంశవృక్షం భారతదేశం అంతా విస్తరించింది. ఆయన వారసత్వాన్ని కేవలం వృత్తిలోనే పుణికి పుచ్చుకున్నది ఆయన పెద్ద కొడుకు రాజశేఖరం. ఆయనకిప్పుడు దాదాపు ఎభై ఏళ్ళు. ప్రస్తుతానికి ఆయనే కుటుంబ పెద్ద.

బంధువర్గం రాకతో ఆ ఇల్లు పొద్దుటినుండి హడావుడిగా వుంది. ప్రతి గుమ్మానికి తోరణాలు కట్టారు. వీధిలో షామియానా వేసారు. ఆ ఇల్లు రాత్రికి మరింత మెరిసిపోవడానికి వీలుగా విద్యుద్దీపాలతో అలంకరిస్తున్నారు కొందరు. పెరట్లో చిన్న షామియానా వేసి భారీ ఎత్తున వంటలు చేయిస్తున్నారు మరికొందరు. మొత్తానికి ఆ ఇల్లంతా సందడిగా ఉంది. కారణం ఆ ఇల్లు కట్టి నూరేళ్ళు పూర్తయ్యాయి. వారసత్వపు హక్కుగా లభించిన ఆ ఇంటి యజమానులు నలుగురూ హడావుడిగా తిరుగుతున్నారు. మధ్యాహ్నం అయ్యేసరికి రావాల్సిన బంధువర్గం అంతా వచ్చింది. భోజనాలు చేసిన వాళ్ళు తలో మూలా చేరి కబుర్లలో పడ్డారు. కొంతమంది షామియానాలో భోజనాల ఏర్పాట్లలో బిజీగా ఉన్నారు. ఆ ఇంట్లో అన్ని వేపులా పిల్లమూకలు చేస్తున్న అల్లరికి అంతు లేకుండా ఉంది. మొత్తానికి నూరేళ్ళు నిండిన ఆ ఇంటికి పెళ్ళి కళ వచ్చింది. ఆ కళ తెప్పించిన కీలక వ్యక్తి 'చందు' అనబడే చంద్రశేఖర్. రాజశేఖరంగారి తమ్ముడు సుబ్రమణ్యంగారి ఏకైక సంతానం. బొంబాయిలో మంచి ఉద్యోగం. ఇంజనీరుగా పనిచేసి రిటైర్ అయిన సుబ్రమణ్యం దంపతులు కూడా ప్రస్తుతం కొడుకు దగ్గిరే ఉంటున్నారు. ఈ కుటుంబం తప్ప మిగిలిన ముగ్గురన్న దమ్ములు ప్రస్తుతం ఆ ఇంట్లోనే ఉన్నారు. చందు ఆ ఇంట్లో



వున్న పెద్ద వాళ్ళందరికీ సాయంత్రం ప్రోగ్రాం గుర్తు చేస్తూ ఆ ఏర్పాట్లలో మునిగిపోయాడు.

*   *   *

అవటానికి పాత పెంకుటిల్లే అయినా లైట్ల వెలుగులో ఆ ఇల్లు శోభాయమానంగా వుంది. ఇంటి ముందున్న వరండాలో జంపఖానాలు పరిచి ఉన్నాయి. చిన్న పిల్లలతో సహా అందరూ అక్కడ ఆసీనులయ్యారు. ఒక మూలగా అందరికీ కనబడేటట్లు మూడు కుర్చీలున్నాయి. కానీ ఆ కుర్చీలో కూర్చుని ఉన్నది ఒక్క రాజశేఖరంగారు మాత్రమే. అందరితో జోకులేస్తూ మాట్లాడుతున్నా ఆయన కళ్ళ వెనుక కనిపించని దైన్యమేదో కదలాడుతున్నది. ఇంతలో చందు ఆయన పక్కగా వెళ్ళి నిలబడి అందరూ వచ్చారని నిర్ధారించుకున్న తర్వాత మెల్లగా గొంతు సవరించుకున్నాడు.

గొంతులో గరగర శబ్దం. మాట మాత్రం రావటం లేదు.

గుండెలో బాధ తన్నుకొస్తోంది. కళ్ళలో కనబడని కన్నీటి చారికలు.

అతని బాధ అర్థం అయిన వాళ్ళ హృదయాలు బరువెక్కాయి. అర్థంకాని వాళ్ళకి అతని మౌనం చిరాకు కలిగిస్తోంది, వాళ్ళలో మొదటి వ్యక్తి అతని బాబాయి సుదర్శనరావు.

"చెప్పదల్చుకున్నది త్వరగా చెప్పరా" అంటూ చిరాకుని బయటకు వెళ్ళగక్కాడు. చందు సంకటస్థితిని అర్థం చేసుకున్న రాజశేఖరంగారు అందరి వేపు ఒకసారి చూసి మాట్లాడటం మొదలుపెట్టారు.

"మీ అందరినీ ఇక్కడకు చేర్పించి, మనందరినీ ఇక్కడ కలిపిందీ మన చందూ. ఎంతో దూరంగా ఉన్నా వాడికి ఈ ఇంటిమీద, ఈ ఇంట్లో పెరిగిన మనందరి మీద మమకారం మిగిలి ఉండటం చాలా. ఆనందంగా ఉంది."

ఆయన మాటల్లో స్పష్టత, గొంతులో ఆర్ద్రత అక్కడున్న చాలామందిని మౌన ప్రేక్షకులను చేశాయి.

"చందూలో ఉన్న సెంటిమెంట్‌ని మనందరం గుర్తించాలి. గౌరవించాలి. ఈ వూరికి దూరంగా జీవితంలో ఎంతో ఎత్తుకు ఎదిగిన చందు ఇక్కడి వాతావరణంలో జరుగుతున్న మార్పులను అవగాహన చేసుకుని సరిగా స్పందించలేకపోతున్నాడు" అంటూ ఒకసారి గట్టిగా గాలి పీల్చుకుని చందూ వేపు చూశారు. చందు కళ్ళలో వేడికోలు ఆయన సంభాషణని పొడిగించలేకపోయింది. కొడుకు మనసుని అర్థం చేసుకున్న అతని కన్నతల్లి అక్కడినుండి మౌనంగా నిష్క్రమించింది. అదే సమయంలో రాజశేఖరంగారి నాలుగవ అబ్బాయి కుమార్ మేనత్త కొడుకు బ్రహ్మంతో సీరియస్‌గా గుసగుసలాడుతున్నాడు.

"బాబాయ్ కొద్దికాలం ఓపిక పడితే మంచి బేరం తగిలేది".

"ఆయన కూతురి పెళ్ళికి పైసా కూడా ఖర్చు పెట్టని నీలాంటి వాళ్ళుంటే ఆయన ఏం చేస్తాడు" అంటూ మంచి రిటార్ట్ ఇచ్చాడు బ్రహ్మం.

"నీతో మాట్లాడటం నాదే బుద్ధి తక్కువ నోరుమూసుకో" అంటూ అరిచాడు అహం దెబ్బతిన్న కుమార్.

ఈ అరుపులతో పాటు వీళ్ళిద్దరి వీపుల మీద చనువుగా రెండు దెబ్బలు వేశారు ప్రభాకర్‌రావు గారు. "మీరిద్దరూ కాసేపు నోళ్ళు మూస్తారా" అంటూ ఆయన పెద్దగా అరిచేసరికి అక్కడున్న అందరి దృష్టి ఆయనవేపు తిరిగింది. ప్రభాకర్‌రావు రాజశేఖరం గారి పెద్ద మేనల్లుడు. వయసు దాదాపు యాభై. స్టేటు గవర్నమెంటులో

అసిస్టెంట్ సెక్రటరీ పోస్టులో ఉన్నారు. స్వశక్తితో పైకొచ్చిన వ్యక్తి అందరితోనూ కలిసిపోయే స్వభావం.

"ఈ శుభ సందర్భంలో మీ ఇద్దరి గొణుగుడు ఏమిట్రా" అంటూ తాను అందరికీ కనబడేటట్లు వెళ్ళి రాజశేఖరంగారి పక్కన నిల్చున్నారు.

"ఈ ఇంటికి నూరేళ్ళు నిండాయి నువ్వు రావాలి బావా అంటూ చందూ ఉత్తరం చూసి చాలా ఆనంద పడ్డాను. తెలిసో, తెలియకో వాడో గొప్ప పని చేశాడు. చరిత్రలో దేనికైనా వందేళ్ళు నిండటం మనం వింటున్నాం. చదువుతున్నాం. కానీ అలాంటి చరిత్రలో ఈ రోజు మనం భాగం పంచుకోవడం ఓ అద్భుతమైన అనుభవం."

అయన పెద్ద గొంతువల్లనైతే నేమి, ఆ కుటుంబంలో ప్రతి వ్యక్తితో వున్న అనుబంధం వల్ల అయితే నేమి అక్కడ వున్న ప్రతి ఒక్కరి ఎటెన్షన్ ఆయనవేపు తిరిగింది. లోపల పనిలో ఉన్న వాళ్ళు కూడా ఒక చెవిని అటువేపు వేశారు. ప్రత్యేకంగా అక్కడ కూర్చున్న పెద్దవాళ్ళ మొహాల్లో ఒక చిన్న రిలీఫ్.

"ఈ ఇంట్లో పుట్టి పెరిగిన మనమందరం ఈ ఇంటితో మనకున్న మధురస్మృతులను జ్ఞాపకం తెచ్చుకుంటే బాగుంటుంది" అక్కడ కూర్చున్న యువ తరంలో ఒక ఆసక్తి వెంటనే చందు అందుకుని..

"పెద్ద అరుగుమీద తాతగారు నీ పెళ్ళి ఫిక్స్ చేయటం నాకు బాగా గుర్తు" అన్నాడు.

"నా పెళ్ళి పేరుతో ఆ రోజుల్లోనే నా దగ్గర పది రూపాయలు కొట్టేసావు గదరా" అనగానే అందరూ పెద్దగా నవ్వారు.

"ఇలాంటి చిన్న చిన్నవి కాదు గానీ ఈ ఇల్లుని తలుచుకోగానే గుర్తుకొచ్చే తాతయ్య. ఆ ఒక్క వ్యక్తి ఎంతమందిని చదివించారు. ఎంత మందిని పెంచారు. ఇక్కడ కూర్చున్న మనమందరం ఏదో రకంగా ఆయనకు రుణపడి ఉన్నాం," మళ్ళీ అక్కడి సీరియస్‌నెస్ గుర్తించి.

"అసలు ఆ రోజుల్లో ఆయనతో పెరట్లో కూర్చుని పేకాట ఆడే దమ్ము ఎవరికీ వుండేది కాదు. నాకు తప్ప," అనగానే పెద్దగా చప్పట్లు.

"పేకాట అంటే గుర్తొచ్చిందిరా ఒకసారి ఏం జరిగిందో తెలుసా" అనగానే అందరి తలలు రాజశేఖరం గారి ఆఖరి చెల్లెలు వేపు తిరిగాయి. ఆమె వైజాగ్‌లో వుంటుంది. కొంచెం వున్న సంబంధంలోనే ఇచ్చారు. సహజంగా ఆ డాబుసరి కనబడుతుంటుంది.

"త్వరగా చెప్పు అత్తయ్యా" మరో మేనకోడలు సుబ్బు అనబడే సుబ్బలక్ష్మి అభ్యర్థన.

"మీ నాన్న సంగతేనే కోడలా" అనగానే వాళ్ళ నాన్న రాజారావు, అమ్మ రాజశ్రీతో సహా అందరూ త్వరగా చెప్పమని ఆమెను ఉత్సాహపరిచారు.

"నాన్న తన స్నేహితులతో పేకాట ఆడుతున్నారు. అందరికీ కాఫీలు ఇచ్చి రమ్మని అమ్మ నన్ను పంపింది,"

" ఆ కాఫీలు ఇచ్చి రారా అని రాజాని అడిగితే..."

"అవ్వన్నీ ఇప్పుడు ఎందుకే" అంటూ మధ్యలో రాజారావు అరుపు. అందరూ ఒక్కసారిగా మాట్లాడటం మొదలుపెట్టారు. "మీ అరుపులు బంగారం గాను. నన్ను చెప్పనివ్వండిరా" అంటూ మళ్ళీ మొదలుపెట్టింది.

"ఈ లోపల కాఫీలు అంటూ నాన్న గొడవ. నేను కాఫీలు తీసుకు వెడుతుంటే కచేరీ గది పక్కన చూరుకింద కూర్చుని ఎవరూ చూడటం లేదనుకుని మీ నాన్న సిగరెట్ తాగుతున్నాడు" మేనకోడలు మీద ముక్తాయింపు నిచ్చింది. మేనత్త మాటలకి తండ్రిని అమితంగా ప్రేమించే సుబ్బలక్ష్మి మొహం ముడుచుకుపోయింది.

"ఆ తరువాత ఈ విషయం తెలిసి అసలే పేకాటలో డబ్బులు పోగొట్టుకున్న తాతయ్య, రాజారావు మామని బాదిన బాదుడు వుంది చూడూ" అని ప్రభాకరం చెప్పేసరికి అక్కడి వాతావరణం అంతా నవ్వులతో నిండిపోయింది. ఆ తరువాత దాదాపు అరగంటసేపు ఎవరు ఎవరితో మాట్లాడుతున్నారో అర్థం గాకుండా గందరగోళంగా తయారయింది. అంతలో సందట్లో సడేమియాలాగే లోపలి నుండి కొన్ని కాగితాలు పట్టుకుని సుదర్శనరావుగారు బయటకొచ్చి అందరినీ నిశ్శబ్దంగా వుండమని ఒక గదమాయింపు గదిమారు.

"ఈ రోజు మనమందరం ఇక్కడ కలవటానికి మరో కారణం వుంది." ఆ కారణాన్ని వ్యతిరేకించే చందు కుటుంబ సభ్యులు, మరి కొంతమంది ముఖాల్లో విషాదరేఖ.

"ఈ ఇంటికి నూరేళ్ళు నిండటమే కాక శిథిలావస్థకు చేరుకుంటోంది. అలాగే నాలాంటి మధ్యతరగతి బతుకు కూడా. నేను ఇంకా ఇద్దరమ్మాయిల పెళ్ళిళ్ళు చేయాలి. ఆఖరువాడికి చదువు చెప్పించాలి. అలాగే రాజాగాడి వైద్యానికి చాలా ఖర్చవుతోంది. వాడి కొడుక్కి బిజినెస్‌లో పెట్టుబడి కావాలి. ఈ ఖర్చులన్నీ అతి వేగంగా మా జీవితాలని శాసించబోతున్నాయి"

అందరూ చాలా దీక్షగా వింటున్నారు. సరదాలు, సరసాలు, తమాషాలతో మొదలైన ఆ సాయంత్రం మెల్లగా సీరియస్‌నెస్‌లోకి మారుతోంది.

"ఈ సమస్యలన్నిటికీ సత్వర పరిష్కారం ఈ ఇల్లు".

"అసలు విషయం ఏమిట్రా!" అంటూ విషయం తెలీని బంధువర్గం ఆరా. అదే సమయంలో రాజారావు రంగప్రవేశం చేశారు.

"మీ అందరికీ తెలుసు. మన ఊరు ఎంత మారిపోతోందో. ఎక్కడ చూసినా ఫ్లాట్స్ వస్తున్నాయి. మంచి సెంటరులో ఉంది మన ఇల్లు. స్థలం విలువే చాలా ఉంది. ఈ జీవిత కాలంలో స్వంత డబ్బు పెట్టి ఇల్లు బాగు చేయించే స్తోమతు ఎలానూ లేదు. వున్నా వేరే అర్జంటు ఖర్చులు నెత్తిమీద వున్నాయి. మన ఇల్లు పడగొట్టి ఫ్లాట్స్ కట్టటడానికి మంచి ఆఫర్ వచ్చింది."

వెంటనే సుదర్శనరావు అందుకుని "అన్నిట్లోకీ గోవిందరెడ్డి ఆఫర్ చాలా బాగుంది. నలుగురికి నాలుగు ఫ్లాట్స్ పైన ఇరవై లక్షలు క్యాష్ ఇచ్చేటట్లు మాట్లాడాము. అందరూ ఒప్పుకున్నారు. కానీ ఇదుగో చందూగాడే అడ్డుపడుతున్నాడు."

"నేను అడ్డుపడటం లేదు బాబాయ్! కనీసం మా వాటా వదిలేసి అమ్ముకోండి."

"మీ ఒక్కడి వాటా వదిలేసి ఎలా అమ్మటం. మీ నాన్న కూడా ఒప్పుకున్నాక నువ్వెందుకురా నస బెడతావు"

"నస కాదు బాబాయ్. ప్రస్తుతం మీకున్నంత డబ్బవసరం మాకు లేదు. నిజమే. కానీ ఈ ఇంట్లో నాకంటే ఎక్కువకాలం గడిపింది మీరు. మీ చేతులలో ఈ చరిత్రని నేలమట్టం చేయొద్దు. మనందరి సంబంధ బాంధవ్యాలను మట్టిపాలు కానివ్వద్దు" అని అభ్యర్థించాడు చందు.

"చందూ చెప్పింది నిజమే" అంటూ ఓ పాయింట్ లేవదీయబోయాడు బ్రహ్మం. "ఒరేయ్. నువ్వు నోరు మూసుకోరా. ఇది మా కుటుంబ విషయం" మళ్ళీ అడ్డు పడ్డాడు కుమార్.

"చందూ! వీళ్ళిద్దరి మాటలు చూసైనా మన బాంధవ్యాలు ఎంత దగ్గరగా వున్నాయో బాగా అర్థం చేసుకో" అనునయించారు చందు తండ్రి.

"దగ్గర దగ్గరగా వున్న వీళ్ళ పరిస్థితే ఇలా వుంటే, దూరంగా వుంటున్న మన సంగతి ఏమిటి? ఇదంతా నీ అనవసర ఆరాటమేమో."

"అయినా మనకూ ఓ ఫ్లాట్ ఉంటుంది గదా. వచ్చిపోతూ అందరినీ కలుసుకోవచ్చు" అందుకున్నది చందు తల్లి. అమ్మ మాట విని అసహనంగా కూర్చున్నాడు చందు.

"ఈ ఇంటికి నూరేళ్ళ సంబరం జరిపించాలని అందరినీ ఇక్కడ కలపాలన్న చందు కోరిక తీరింది. అలాగే ఈ రోజుతో ఈ ఇంటికి నూరేళ్ళు నిండుతున్నాయి. నాన్నా చందూ, నేను అశక్తుడినిరా అయాం సారీ" మెల్లగా లోపలికి వెళ్ళాడు రాజశేఖరం గారు.

"నాన్నా నేను వూరెళ్ళాలి ఆ సంతకాలు ఏమిటో త్వరగా చూడండి" అసహనంగా అరిచాడు సుదర్శనరావు గారి పెద్ద కొడుకు. తరువాత కార్యక్రమం వెంటనే పూర్తయింది. ఆ ఇంటి మీద వారసత్వపు హక్కు వున్న వాళ్ళందరూ సంతకాలు పెట్టారు. నలుగురన్నదమ్ములూ అయిదేసి లక్షలు క్యాష్, ఒక్కో ఫ్లాట్ త్వరలో సంపాదించబోతున్నారు. కొందరి మొహాల్లో తృప్తి, మరికొందరి మొహాల్లో నిస్తేజం.

"దయచేసి అందరూ ఒక్కసారి కూర్చోండి.." అభ్యర్థించాడు చందూ. అతన్ని కాదనలేక ఎక్కడి వాళ్ళక్కడ అతను ఏం చెప్పబోయేది వినటానికి సిద్ధపడ్డారు.

"మన ఇంటికి నూరేళ్ళు నిండాయి. సరదాగా ఒక చిన్న సెలబ్రేషన్ చేయాలన్న ఐడియాను మన్నించి అందరూ మీమీ ఖర్చులతో వచ్చినందుకు కృతజ్ఞతలు. నూరేళ్ళ సంబరంతో ఈ ఇంటికి నూరేళ్ళు నిండిపోతున్నాయి."

"చరిత్రలో శతాబ్దాలు నిండిన ఎన్నింటినో మనం చూశాం. వాటిని ఇప్పటికీ మనం ఆదరిస్తున్నాం. మన సంస్కృతికి ప్రతీకలుగా గుర్తించాం. వాటి వెనుక కథలు మననం చేసుకుంటున్నాం,"

"వీడి చరిత్ర పిచ్చితో మనల్ని చంపుతున్నాడురా" బ్రహ్మంగాడు గొణిగాడు. "నోరు మూసుకో" అన్నట్లు చూసింది వాడి వేపు వాళ్ళమ్మ

"ఉదాహరణకు తాజ్‌మహల్ తీసుకోండి. దాని వెనుక ముంతాజ్, షాజహాన్‌ల ప్రేమ కథ మాత్రమే వుంది. కానీ ఈ ఇంటి వెనక వున్నదో ఏ ఒక్కరో ఇద్దరో

కాదు. మనమందరం ఇక్కడ పుట్టాం పెరిగాం. చదువుకున్నాం. ఎంతోమంది వ్యక్తుల, కుటుంబాల బాంధవ్యాలకు పునాది ఇక్కడ ఉంది. నిజానికి ఈ ఇల్లు మనందరికీ ఒక బలమైన రూట్,'' ఈ ఆఖరి. వాక్యం అక్కడున్న ప్రతి ఒక్కరిమీద అద్భుతంగా పనిచేసింది. ఎవరూ ఏమీ మాట్లాడలేకపోతున్నారు.

"అర్బనైజేషన్, కమర్షియలైజేషన్ మొదలైన పదాలను నేను వాడను. ఎందుకంటే నేనూ వాటి ప్రభావంలో కొట్టుకుపోతున్నాను కనుక. కానీ వీటన్నింటికి అతీతంగా మన సంస్కృతి చిహ్నాలను అంటే మానవ సంబంధాలను పటిష్ఠంగా వుంచే ఇలాంటి ప్రతీకలను కాపాడుకోవాల్సిన కనీస బాధ్యత మనకు లేదా? ఇక్కడ కట్టే ఫ్లాట్స్ గురించి, మన మనవలు, మునిమనవలు వందేళ్ళ తర్వాత చెప్పుకోవచ్చు. అసలు అప్పటివరకు ఈ ఫ్లాట్స్ కూడా వుంటాయన్న గ్యారంటీ లేదు. ఇప్పటికే ఈ ఇంటి రూపురేఖలు మారిపోయాయి. కేవలం ఆనవాళ్ళు మిగిలాయి. రేపు ఇవి కూడా వుండవు అన్న ఫీలింగ్ వస్తే...''

చందూలోని ఉద్వేగం తారస్థాయికి చేరి మరింకేమీ మాట్లాడలేక అక్కడనుండి నిష్క్రమించాడు. కొన్ని నిమిషాలు అక్కడ భయంకరమైన నిశ్శబ్దం. ఇంతలో ఓ పిల్లాడు ఆకలికి అరిచిన అరుపు ఆ నిశ్శబ్దాన్ని పటాపంచలు చేసింది. అంతే, అక్కడున్న ప్రతివాళ్ళు మామూలు స్థితిలోకి వచ్చి తమ తమ పనులలోకి ఉద్యుక్తులయ్యారు.

ఈ కథ ఇంతటితో అంతమయితే గుమ్మానికి కట్టిన మామిడి తోరణంలా పచ్చగా భాసించేదేమో.. కానీ...

*   *   *

తెల్లవారింది. మళ్ళీ ఇల్లంతా హడావుడిగా ఉంది. వూళ్ళకి వెళ్ళే వాళ్ళు ప్రతి విషయంలోనూ తొందర పడుతున్నారు. సుబ్రమణ్యం దంపతులు ప్రయాణానికి రెడీ అవుతున్నారు. చందూ కోసం వెతికితే పెరట్లో ఓ మూల నూరువరహాల చెట్టు కింద నిద్రపోతున్నాడని చెప్పారు.

"వెధవకి చిన్నప్పటినుండి ఆ నూరువరహాల చెట్టంటే మరీ పిచ్చి-'' మురిపెంగా అనుకుంటూ ఆ వైపు నడిచింది చందూ తల్లి. మంచం దగ్గరికెళ్ళి చెయ్యి పట్టి కుదిపింది. అంతే, చల్లగా తగిలిన చందు శరీరాన్ని చూసి ఘొల్లుమంది. ఆ రోదనకు బంధువర్గం గుండెలు ఝల్లుమన్నాయి.

"నూరేళ్ళ మహోత్సవం .జరిపిన వీడికి అప్పుడే నూరేళ్ళు నిండాయా'' ఎవరో గొణిగారు బంధువర్గంలో.

నూరేళ్ళ చరిత్ర చూడాలనుకున్న నూరు వరహాల చెట్టు, నూరేళ్ళు నింపుకున్న చందూపై నాలుగు పువ్వులు రాల్చింది-

వాళ్ళు జలదరించి...


అతని ప్రియనేస్తం...

మాటలు రాక నిశ్చేష్టురాలై నిలిచింది-

శిథిలమవుతున్న... ఆ ఇల్లు...

* * *

# చిట్కాలు



ఇంట్లో ఈగలు పోవాలంటే నీటిలో ఉప్పును కరిగించి యిల్లంతా చల్లాలి.

వెల్లుల్లి తోలు తియ్యడానికి ఎండలో పెట్టి వేడెక్కిన తర్వాత సిమెంట్ నేలపైన మృదువుగా రుద్ది ఊదితే తోలు వచ్చేస్తుంది.

వాషింగ్‌కి షర్ట్ ప్యాంట్ వేసేటప్పుడు ఒక ఔన్సు శుభ్రమైన పెట్రోలును బ్రష్‌తో కాలర్లు చేతులు మురికి వున్న చోట పూసి సబ్బునీళ్ళలో మిషన్‌లో వేస్తే మురికి శుభ్రంగా పోయి మళ్ళీ బ్రెష్ చెయ్యకుండా సరిపోతుంది.

వర్షాకాలంలో ఆవనూనె కొద్దిగా బూట్ల లోపలి భాగంలో రాస్తే బూజు, ఫంగస్ చేరదు.

పంచదార చీమలు పట్టకుండా వుండాలంటే నాలుగు లవంగాలు పంచదారలో వేయాలి.

పుస్తకాలు పురుగు పట్టకుండా వుండాలంటే నాఫ్తలీన్ వుండలతో పాటు మంచి మిరియాలు కూడా వేస్తే పురుగు అసలు పట్టదు.

తులసి ఆకుల రసం తీసి ఒక స్పూనురసంలో కొద్ది తేనె కలిపి ఉదయాన్నే తీసుకుంటే జలుబు భారం తగ్గిపోతుంది.

జలుబు వలన తలనొప్పి వున్నట్లయితే లవంగాలు చాది కణతలకు రాసుకుంటే తలనొప్పి ఇట్టే మాయ మవుతుంది.

కర్పూరం వాసన చూసినట్లయితే ముక్కుదిబ్బడ పోతుంది.

నూనె మరకలు పడ్డ కుర్చీ కవర్లను షాంపూతో శుభ్రం చేయాలి.

గోధుమల డబ్బాలో వేపాకులు, ఉప్పు వేసి బాగా కలిపి వుంచితే పురుగులు పట్టవు. మెంతికూర ఆకులు ఎండబెట్టి వేసినా గోధుమలు నిలవ వుంటాయి.

కవర్లలో ఫోటోలు పంపవలసి వస్తే కవర్లో టాల్కంపౌడర్ చల్లితే ఫోటోలు అంటుకోకుండా వుంటాయి.

చిన్నపిల్లలు కక్కుకోగానే ఆ దుస్తులను బేకింగ్ సోడా కలిపిన నీటిలో ముంచితే వాసన పోతుంది.

నడుము పట్టేసినప్పుడు నేలమీద వెల్లకిలా పడుకోవాలి.

దోసకాయను పలుచని చక్రాల్లా తరిగి ఏకకాలంలో వాటిని రెండు కళ్ళమీద పెట్టుకుని పది నిముషాలుం చుకుని చల్లని నీటితో (ఫ్రిజ్‌నీటితో కాదు) ముఖం కడుక్కుంటే కళ్ళమంట తగ్గుతుంది.

మెంతికూర ఆకులను మెత్తగా నూరి తలకి పట్టించి ఆరిన తర్వాత తలస్నానం చేస్తే జుట్టు బాగా పెరుగుతుంది.

ఎక్కువగా నీళ్ళలో పనిచేసేవారు రాత్రివూట కాళ్ళకు చేతులకు ఆముదం పూసి మర్దనా చేస్తే మృదువుగా వుంటాయి.

పెరుగు, నిమ్మరసం, వేపాకు నూరిన ముద్ద తలకు పట్టించి గంట తర్వాత వేడి నీటితో స్నానం చేస్తే తలలో చుండ్రు తగ్గుతుంది.

విరిగిన పాలలో వెండి నగలు వేసి శుభ్రం చేస్తే మెరుపునిస్తాయి.

కొత్తిమీర, కరివేపాకు గుడ్డలో చుట్టి పొడిగా వున్న పాలిథీన్ బ్యాగ్‌లో వేసి ఫ్రిజ్‌లో వుంచితే వారం రోజులు నిల్వ వుంటాయి.

వాటర్ ఫిల్టర్ కాండిల్స్, ఎమ్రీపేపర్‌తో రుద్దితే మళ్ళీ కొత్త ఫిల్టరులా తయారవుతాయి.

దోసెలు పలచగా వుండాలంటే దోసెలు వేసేముందు పిండిలో కొద్దిగా అన్నం వార్చిన గంజిని కలపాలి.

డైనింగ్ టేబుల్‌ను కర్పూరం కలిపిన కొబ్బరి నూనెతో తుడవాలి.

పచ్చిమిరపకాయలను మరుగుతున్న నీటిలో వేసి కాసేపుంచి తీసి ఎండబెడితే కారం తగ్గిపోతుంది.

పెరుగు త్వరగా కావాలంటే నులివెచ్చని పాలలో కాస్త సిట్రిక్ యాసిడ్ వేస్తే పెరుగయిపోతుంది.

తేనె సీసాలో లవంగాలు రెండు వేస్తే తేనె చెడిపోదు.

– జి. ఇందిరామూర్తి

కావలి